మాజీ సర్పంచులను అరెస్టు చేసి వాహనంలో పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

మాజీ సర్పంచుల 'చలో సెక్రటేరియేట్' ఉద్రిక్తం

- సచివాలయంలోకి వెళ్లేందుకు జేఏసీ నాయకుల విఫలయత్నం
- పోలీసుల అడ్డగింత.. అరెస్టు
- అక్రమ అరెస్టులకు భయపడం: సుర్వి యాదయ్యగౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మాజీ సర్పంచ్‌లు చేపట్టిన సచివాలయ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. మాజీ సర్పంచ్‌లు ఆకస్మాత్తుగా సచివాలయంలోకి దూసుకెళ్లేందుకు యత్నించగా.. పోలీసులు వారిని అడ్డుకున్నారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, సహాయ కార్యదర్శి కేశబోయిన మల్లయ్య, నెమలి సుభాష్ గౌడ్, మెడబోయిన గణేష్, బొల్లం శారద, బకీర్ బీరప్ప, బొమ్మరపు సురేష్, బత్తిని తిరుమలేష్, ఎలుగు సోమయ్య, వర్రె శ్రీనివాస్, దండబోయిన మల్లేశ్, లచ్చిరామ్ నాయక్, గానుగుపాడు శ్రీనివాస్, వెంకటరామిరెడ్డి, పాండు రంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, పద్మారెడ్డిని అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. 13 నెలలుగా బిల్లుల కోసం ఉద్యమాలు చేస్తున్నామని, ఇప్పటికే పలువురు మాజీ సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. శాంతియుతంగా ధర్నా చేస్తుంటే ముందస్తుగా అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. తమ బిల్లులు చెల్లించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన ప్రజాపాలన ఇదేనా? అని ప్రశ్నించారు. అప్పులు చేసి గ్రామాలను అభివృద్ధి చేసిన తమకు ఇచ్చే గౌరవం ఇదేనా? అని నిలదీశారు. తమ సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేసేదాకా తమ పోరాటం ఆగదని తేల్చిచెప్పారు.

- విప్‌లను అభినందించిన కేసీఆర్

శాసనమండలి విప్, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, శాసనసభలో విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద బుధవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు విప్‌గా అవకాశం కల్పించినందుకు వారు ఎర్రవెల్లిలోని నివాసంలో కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. – హైదరాబాద్

పూటకో మాట మార్చే కాంగ్రెస్‌ను నమ్మొద్దు

- ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలం
- సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో అరిగోస పడుతున్న రైతులు, ప్రజలు
- నవాబుపేటలో రైతుధర్నాలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి

రైతు ధర్నాలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కార్తీక్‌రెడ్డి, శ్రీశైల్‌రెడ్డి

వికారాబాద్/నవాబుపేట, ఫిబ్రవరి 5 : పూటకో మాట మార్చే కాంగ్రెస్‌ను నమ్మొద్దని, కాంగ్రెస్ పాలనలో ప్రజలు, రైతులు అరిగోస పడుతున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల కేంద్రంలో రైతు వ్యతిరేక కాంగ్రెస్ సర్కార్‌పై జంగ్ సైరన్‌కు జాతీయ మీడియా కోఆర్డినేటర్ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌తో కలిసి రైతు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఓ మాట .. లేనప్పుడు ఓ మాట మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 14 నెలలు అవుతున్నా 6 గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలుచేయలేదని మండిపడ్డారు. చారాణా వంతు మందికి రుణ మాఫీ చేసి 100 శాతం అయిందని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. రుణమాఫీ కావాలని రైతులు ధర్నా చేస్తే పోలీసులతో అరెస్టు చేయిస్తున్నదని మండిపడ్డారు. జనవరి 26న రైతులకు రైతుభరోసా అందుతుందని మాట ఇచ్చి మోసం చేసిందని ఎద్దేవా చేశారు. ఆసరా పింఛన్, రేషన్ కార్డులు, మహిళలకు రూ.2500, తులం బంగారం ఎక్కడ అని నిలదీశారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతం చేస్తామని మాట మార్చడంపై మండిపడ్డారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ చేవెళ్లలో ఉపఎన్నికలు వస్తాయని కేటీఆర్ ముందే చెప్పారని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో గులాబీ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ మోసాన్ని రైతులు చెట్ల కింద, బావుల కాడ, ఎక్కడ పడితే అక్కడ ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ తిరిగి వస్తేనే తెలంగాణ ప్రజలు బాగుపడుతారని తెలిపారు.

లోకం పోకడ

చిత్తు కాగితాలు లేవా? పోనీ, కులగణన కాగితాలుంటే ఇవ్వండి.. కొంటాం!

ఫ్రంట్‌లైన్ వర్కర్లకు జీతాలివ్వకపోవడం సిగ్గుచేటు

మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఫ్రంట్‌లైన్ వర్కర్లకు జీతాలివ్వకపోవడం సిగ్గుచేటని మాజీమంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ దవాఖానలల్లో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి 3 నెలలుగా జీతాలు చెల్లించకుండా వాళ్లు రోడ్డెక్కేలా చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని ఎద్దేవాచేశారు. జీతం రాకపోవడంతో పిల్లల చదువులు, ఇంటి కిరాయిలు చెల్లించలేక కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. టెండర్ ప్రకారం జీతాలు ఇవ్వకుండా, పీఎఫ్ డబ్బులు జమ చేయకుండా కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని, వర్కర్లకు అన్యాయం జరుగుతుంటే సర్కార్ ఏం చేస్తున్నదని నిలదీశారు. ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి చిరుద్యోగుల ఆవేదన కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫంట్‌లైన్ వర్కర్లకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా సకాలంలో వేతనాలివ్వాలని, జీతంలో కాంట్రాక్టర్లు కోత పెట్టకుండా నిలువరించాలని కోరారు.

మాజీ సర్పంచుల అరెస్టు అక్రమం

పెండింగ్ బిల్లులు అడిగితే అరెస్టు చేస్తారా?: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ సచివాలయాన్ని ముట్టడించిన తాజా మాజీ సర్పంచులను అరెస్టు చేయడం అక్రమమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వ తీరును ఖండించారు. పెండింగ్ బిల్లులు అడిగితే అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు. రాష్ట్ర సచివాలయం ముందే మాజీ సర్పంచ్‌లు కంటతడి పెట్టుకోవడం అత్యంత బాధాకరమని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా కనికరం లేని కాంగ్రెస్ సర్కారు తన తీరు మార్చుకోవాలని సూచించారు. సర్పంచ్‌ల నుంచి కమీషన్లు రావన్న ఒకే ఒక్క కారణంతో నిధులు విడుదల చేయడం లేదని విమర్శించారు. గ్రామాల అభివృద్ధి కోసం పాటుపడిన మాజీ సర్పంచ్‌లకు ఇప్పటికైనా బిల్లులు విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

- బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్, బీజేపీ నాయకులు

సూర్యాపేట జిల్లా తుంగతుర్తికి చెందిన మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోపగాని రమేశ్‌గౌడ్‌తో కలిసి కాంగ్రెస్, బీజేపీ నాయకులు పలువురు బుధవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిశోర్ కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, ప్రజలకు చేస్తున్న మోసాలు, అన్యాయాలను ఎండగట్టేందుకు అనేకమంది బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు తెలిపారు. – తుంగతుర్తి

టెట్ ఫలితాలు విడుదల

- ఎట్టకేలకు విడుదల చేసిన విద్యాశాఖ
- పేపర్-1లో 59%, పేపర్-2లో 31% క్వాలిఫై
- పేపర్-1లో 41,327 మంది, పేపర్-2లో 42,384 మంది ఉత్తీర్ణత

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం సచివాలయంలో విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా ఫలితాలు విడుదల చేశారు. పేపర్-1లో 59.48 శాతంతో 41,327మంది, పేపర్-2లో 31.21శాతంతో 42,384 మంది ఉత్తీర్ణులయ్యారు. టెట్ పరీక్షలను ఈ నెల 2 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించగా, 2,75,753 మంది హాజరయ్యారు. బుధవారం ఫలితాలు విడుదల చేయాల్సి ఉండగా, ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో విద్యాశాఖ తర్జనభర్జనలు పడింది. కానీ ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో ఎట్టకేలకు బుధవారమే టెట్ ఫలితాలు ప్రకటించారు. ర్యాంకు కార్డులను బుధవారం నుంచే డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి, విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ హరిత, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ జీ రమేశ్ పాల్గొన్నారు.

పైరవీలు చేయొద్దు.. అందరూ చేరాల్సిందే!

సచివాలయంలోని ఎస్‌వోల బదిలీలపై ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): సచివాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 177 మంది సెక్షన్ ఆఫీసర్లు బదిలీ అయినప్పటికీ చాలా మంది కొత్త పోస్టుల్లో చేరకపోవడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. బదిలీలను ఆపేందుకు పైరవీలు చేస్తున్నట్టు చర్చ జరుగుతున్నది. ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డికి తెలిసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. పైరవీలను ప్రోత్సహించొద్దని, అందరూ కొత్త పోస్టుల్లో చేరాల్సిందేనని ఆదేశించినట్టు తెలిసింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు సూచించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అందరినీ ఒక ప్రత్యేకమైన కారణంతోనే బదిలీ చేశారని, పైరవీలు చేసి పాత స్థానాల్లోకి వస్తే లక్ష్యం నెరవేరదని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం.

హరీశ్‌రావు మధ్యంతర బెయిల్ పొడిగింపు

గత ఉత్తర్వులను 12వరకు పొడిగించిన హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): రియల్‌ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ చేసిన ఫిర్యాదుపై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు టీ హరీశ్‌రావుకు హైకోర్టు మంజూరుచేసిన మధ్యంతర బెయిల్‌ను ఈ నెల 12 వరకు పొడిగించింది. రాజకీయ కక్షతో చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పీఎస్‌లో తనపై నమోదు చేసిన ఫోన్ ట్యాపింగ్ కేసును కొట్టివేయాలని హరీశ్‌రావు వేసిన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం విచారణ జరిపారు. హరీశ్‌రావు తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది దామ శేషాద్రినాయుడు వాదనలు వినిపించేందుకు సిద్ధమయ్యారు. అయితే, ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది హాజరవుతారని, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కారణంగా విచారణకు హాజరుకాలేకపోయారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు చెప్పారు. విచారణను వాయిదా వేయాలని కోరారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి.. సీనియర్ అడ్వకేట్ రావడం లేదన్న విషయాన్ని ముందుగానే పిటిషనర్లకు సమాచారం ఇచ్చి ఉంటే బాగుండేది కదా అని అన్నారు. ఢిల్లీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని ముందుగా తెలిసినప్పుడు ముందుగానే సమాచారం ఇవ్వాలని, పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కూడా ఢిల్లీ నుంచే వచ్చారని గుర్తుచేశారు. చివరికి తదుపరి విచారణను ఈ నెల 12కు వాయిదా వేశారు. ఆరోజు తప్పకుండా వాదనలు వినిపించాలని, మళ్లీ వాయిదా కోరవద్దని ఇరుపక్షాలకు తేల్చి చెప్పారు.

నెలాఖరు నుంచి పెరుగనున్న ఎండలు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తేతెలంగాణ): తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి వీస్తున్న వేడి గాలుల కారణంగా తెలంగాణలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో 32 డిగ్రీల నుంచి 36 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వెల్లడించింది. ఈ నెల చివరి నుంచి ఎండలు మరింత పెరుగుతాయని తెలిపింది.

హామీల అమలులో రాష్ట్ర సర్కారు విఫలం

- వామపక్షాలతో ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటు చేస్తాం
- ప్రజా ఉద్యమాలతో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతాం
- స్థానిక ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ
- 'మీట్ ది మీడియా'లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే సంయుక్తంగా బుధవారం నిర్వహించిన మీట్ ది మీడియా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని అన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ మతోన్మాద రాజకీయాలు, బీజేపీ పట్ల తమ వైఖరేంటో స్పష్టం చేయాలని అన్నారు. సీపీఎం పార్టీ విస్తరించడానికి బలమైన ఉద్యమాలు, విస్తృత పోరాటాల ద్వారా ప్రజలకు చేరువవుతామని చెప్పారు. వామపక్ష పార్టీలను కలుపుకొని రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను ఏర్పాటు చేసేందుకు సీపీఎం చొరవ తీసుకుంటుందని తెలిపారు. తెలంగాణలో వామపక్ష ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేస్తామని, వామపక్ష పార్టీలు బలంగా ఉన్నచోట పరస్పరం సహకరించుకుంటామని చెప్పారు. కేంద్రంలోని మోదీ సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్ ముమ్మాటికీ పేదల వ్యతిరేకమైనదని విమర్శించారు. కమ్యూనిస్టు పార్టీగా దేశంలోని ప్రతి ఒక్కరికి ఉచిత విద్య, వైద్యం అందాలని తాము కోరుకుంటుంటే మోదీ ఆ రెండు రంగాలను పూర్తిగా కార్పొరేట్ల చేతుల్లో పెట్టే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలకు కేటాయింపులే లేవని అన్నారు. వామపక్ష పార్టీల ఐక్యత తమకు తొలి ప్రాధాన్యం జాన్‌వెస్లీ చెప్పారు. ఉపాధి హామీ కార్మికులకు రోజు కూలీ రూ.400 కోసం కొట్లాడుతామని, రైతులకు గిట్టుబాటు ధర కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. రాష్ట్రంలో 30 లక్షల మంది పేదలకు ఇండ్ల స్థలాలిచ్చే వరకూ వెనక్కి తగ్గబోమని అన్నారు. తమ హక్కుల కోసం పోరాటాల్లో కలిసి వస్తున్న ప్రజలకు రాజకీయ చైతన్యం కల్పించడంలో కొంత వైఫల్యం ఉన్నమాట వాస్తవమేనని అంగీకరించారు.

సీఎం రేవంత్‌వి అవగాహనలేని మాటలు

- ఒక్క పథకం కూడా అమలు కాలేదు
- బీసీ రిజర్వేషన్ అమలు చేయాల్సిందే
- 10న కేటీఆర్ ఆధ్వర్యంలో రైతు ధర్నా
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, ఫిబ్రవరి 5: సీఎం రేవంత్‌రెడ్డి అవగాహనలేమితో మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నప్పటికీ ఒక్క పథకం కూడా పూర్తి స్థాయిలో అమలుకాలేదని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన కొడంగల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగు పథకాల అమలులో భాగంగా గత నెల 26న కోస్గిలో బహిరంగసభ ఏర్పాటు చేసి రాత్రికి రాత్రే రైతు ఖాతాల్లో రైతుభరోసా జమ అవుతుందన్నారని, అరగంటలోనే మాటమార్చి 31వ తేదీలోపు అందిస్తామని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం ఎప్పుడు ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కావడం లేదని విమర్శించారు. ప్రతి రైతుకు లబ్ధి చేకూరేవరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు. అధికారాన్ని దక్కించుకోవాలని ఏవిధంగా నోటికి వచ్చిన హామీని ఇచ్చారో అదేవిధంగా అమలు చేసేందుకు కూడా కృషి చేయాలని హితవుపలికారు. రైతుభరోసా, రైతుబీమా అందకపోవడంతో రైతులు వ్యవసాయం అంటేనే భయపడుతున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటివరకు మహిళలకు రూ.2500, తులం బంగారం, రూ.6వేల పెన్షన్ వంటి పథకాలు అమలు ఎందుకు నోచుకోవడంలేదని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగని కారణంగా గ్రామపంచాయతీలకు నిధులు అందక అభివృద్ధిలో వెనుకబడిపోతున్నట్టు పేర్కొన్నారు. సర్పంచ్‌లు అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు నానాతంటాలు పడ్డారని, వారికి వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు చేపట్టాలని సూచించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుచేసేందుకు అసెంబ్లీలు బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్‌కు చట్టబద్ధతతో 42శాతం అమలు చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 10న నియోజకవర్గంలోని కోస్గిలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో రైతు ధర్నా కార్యాక్రమాన్ని చేపడుతున్నట్టు పేర్కొన్నారు. రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో పాటు అభిమానులు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు.

సభ్యకార్యదర్శి అసభ్య ప్రవర్తన!

- జీఆర్ఎంబీలో మహిళా అధికారులపై వేధింపులు
- ఫిర్యాదు చేసిన వారిపై కక్షతో మెమోల జారీ
- బోర్డులో ఉండలేమంటూ రాష్ట్ర ఉద్యోగుల ఆవేదన

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ)లోని మెంబర్ సెక్రటరీ అళగేశన్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు వస్తున్నాయి. మహిళా అధికారులు, ఉద్యోగుల వ్యక్తిగత వివరాలను తెలుసుకొని.. మీటింగుల్లో బహిర్గతం చేశారని తెలిసింది. మహిళా ఉద్యోగుల వస్త్రధారణపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం, పని ఉందని పిలిచి తన చాంబర్‌లో గంటలకొద్దీ కూర్చోబెట్టుకునేవారని పలువురు ఆరోపిస్తున్నారు. వారాంతాల్లో ఇంటికి లంచ్ లేదా డిన్నర్‌కు పిలవాలని మహిళా ఉద్యోగులకు చెప్పేవారని అంటున్నారు. లైంగిక వేధింపులకు పాల్పడ్డారని చెప్తున్నారు. ఆయనపై ఇప్పటికే లైంగిక వేధింపుల ఆరోపణలు చాలా వచ్చాయని, కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది. లైంగిక వేధింపులపై గత ఏడాది మహిళా ఉద్యోగులు చైర్మన్‌కు ఫిర్యాదు చేశారని చెప్తున్నారు.

ఆర్థిక అవకతవకలు కూడా..

అళగేశన్ మహిళలను వేధించడమే కాకుండా ఆర్థిక అవకతవకలకు కూడా పాల్పడ్డారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌పోర్ట్ అలవెన్సు తీసుకుంటూనే.. ప్రభుత్వ వాహనాన్ని వాడుకున్నారన్న ఆరోపణలు ఉన్నా యి. చైర్మన్ అనుమతి లేకుండానే ఇటీవల బెంగళూరు ట్రిప్పులో ఆటో, కారు చార్జీల రూపంలో రూ.13 వేలు డ్రా చేశారన్న ఆరోపణలు వచ్చాయి. కంటి సర్జరీ కాకుండానే అయినట్టు చెప్పి లెన్స్ కోసం రూ.21 వేలు తీసుకున్నారని ఆరోపిస్తున్నారు. జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీ, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పీపీఏ)కి సంబంధించిన అధికారులకు నిర్వహించిన క్లాసులకు ఒక్కోదానికి రూ.10 వేల చొప్పున వసూలు చేశారని ఆరోపిస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఎంపిక విషయంలోనూ ఏకపక్షంగా వ్యవహరించారని చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం కాకుండా.. కేంద్ర ప్రభుత్వ వ్యయాలను ప్రస్తావిస్తూ బిల్లులు డ్రా చేశారని అంటున్నారు. జలసౌధలో ఇప్పటికే సెక్యూరిటీ సిబ్బంది ఉండగా.. మళ్లీ ప్రత్యేకంగా జీఆర్ఎంబీ కోసం సెక్యూరిటీ సిబ్బందిని నియమించి ఖర్చులు అధికంగా చూపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తనపై ఫిర్యాదు చేసిన బోర్డు ఉద్యోగులకు అళగేశన్ మెమోలు జారీ చేసినట్టు తెలిసింది. ఉద్యోగుల ఫిర్యాదు ఆధారంగా ఇప్పటికే సీడబ్ల్యూసీ చైర్మన్, కేంద్ర జలశక్తి శాఖకు ఈఎన్‌సీ జనరల్ ఫిర్యాదు చేశారు. జీఆర్ఎంబీ ఉద్యోగులు, ఇంజినీరింగ్ అసోసియేషన్స్ ఆయనపై మరోసారి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఆయనను తప్పించాలని వారు కోరుతున్నారు.

మానవత్వం చాటిన ఆర్టీసీ సిబ్బందికి సన్మానం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : విధి నిర్వహణలో మానవత్వం చాటిన సిబ్బందిని టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. హైదరాబాద్ బస్‌భవన్‌లో బుధవారం ఉన్నతాధికారులతో కలిసి మణుగూరు డిపో డ్రైవర్ కోటేశ్వర్‌రావు, గద్వాల్ డిపో కండక్టర్ కిశోర్‌కుమార్, డ్రైవర్ నరేందర్‌గౌడ్, జగిత్యాల డిపో మేనేజర్ సునీతను సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ సత్కరించారు. కార్యక్రమంలో సీవోవో రవీందర్, ఈడీలు మునిశేఖర్, ఖుస్రోషాఖాన్, రాజశేఖర్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, హెచ్‌వోడీలు విజయభాస్కర్, వెంకన్న, శ్రీదేవి, ఉషాదేవి పాల్గొన్నారు.

డ్రైవర్ చాకచక్యం.. ఆభరణాల అప్పగింత

గతేడాది డిసెంబర్ 21న మణుగూరు డిపోకు చెందిన బస్సులో ఓ ప్రయాణికురాలి 10 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. ఈ విషయాన్ని ఆమె డ్రైవర్ కోటేశ్వర్‌రావుకు చెప్పింది. వెంటనే అప్రమత్తమైన ఆర్టీసీ డ్రైవర్.. బస్సును భద్రాచలం బస్‌స్టేషన్‌లో నిలిపి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు వచ్చి బస్సులోని ప్రయాణికులను తనిఖీచేసి ఆభరణాలు అపహరించిన మహిళను పోలీసులకు అప్పగించారు. బంగారు ఆభరణాలను పోలీసులు ప్రయాణికురాలికి అప్పగించారు. దీంతో డ్రైవర్ కోటేశ్వర్‌రావును డిపో డీఎం, ఆర్టీసీ సిబ్బంది అభినందించారు.

మహిళకు గుండెపోటు.. సీపీఆర్ చేసిన డీఎం

జనవరి 12న జగిత్యాల బస్‌స్టేషన్‌లో ఓ ప్రయాణికురాలికి గుండెపోటు వచ్చింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న డీఎం సునీత వెంటనే అప్రమత్తమై ఆమెకు సీపీఆర్ చేశారు. అనంతరం 108 సాయంతో జగిత్యాల ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. డీఎం సకాలంలో స్పందించడంతో ప్రయాణికురాలికి ప్రాణాపాయం తప్పింది.

బస్సులో ప్రసవం.. సిబ్బంది ఉదారత

జనవరి 2న గద్వాల డిపోకు చెందిన బస్సులో ఓ గర్భిణికి ఒక్కసారిగా పురిటినొప్పులు వచ్చాయి. విషయాన్ని గమనించిన కండక్టర్ కిశోర్‌కుమార్.. డ్రైవర్ నరేందర్‌గౌడ్‌కు తెలిపారు. వెంటనే బస్సును పక్కకు ఆపి..108కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పురుడుపోశారు.

ముగ్గురికి శాశ్వత న్యాయమూర్తులుగా సుప్రీం ఆమోదం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తేతెలంగాణ): తెలంగాణ హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా పనిచేస్తున్న జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి, జస్టిస్ కలశికం సజనలను పూర్తిస్థాయి న్యాయమూర్తులుగా నియమించాలన్న ప్రతిపాదనలకు బుధవారం సుప్రీంకోర్టు కొలీజియం ఆమోదం తెలిపింది. దీంతో ఈ ముగ్గురు శాశ్వత న్యాయమూర్తులుగా పనిచేయనున్నారు. జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ అనిల్‌కుమార్, జస్టిస్ సజనను న్యాయవాదులు అభినందించారు.

బోయిన్‌పల్లి బాపూజీ నగర్‌లో ఎమ్మెల్యే శ్రీ గణేశ్‌ను ఇండ్లు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నిస్తున్న బస్తీ మహిళలు

ఆర్థిక పరిస్థితి బాగోలేదు

ఇండ్లు ఇప్పుడే ఇవ్వలేం : ఎమ్మెల్యే శ్రీ గణేశ్

బొల్లారం,ఫిబ్రవరి 5: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని, పథకాలు వెంటనే అమలు కావని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. న్యూబోయిన్‌పల్లిలోని బాపూజీనగర్‌లో బుధవారం శ్రీ గణేశ్ పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీ మహిళలు డబుల్ బెడ్‌రూంలు, ఇందిరమ్మ ఇండ్లు ఎప్పుడు ఇస్తారని ఎమ్మెల్యేని ప్రశ్నించగా.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని, ఇండ్లు ఇప్పుడే ఇవ్వలేమని జవాబిచ్చారు. మరీ ఎన్నికల సమయంలో ఎందుకు హామీలు ఇచ్చారని నిలదీశారు. దీంతో సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, బస్తీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.